# ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 వివరాలతో ప్రస్తుత వివరాలు సరిపోలుస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. రాజకీయ పార్టీలు ఏజెంట్‌ను నియమించుకొని మ్యాపింగ్ ప్రక్రియకు సహకారం అందించేలా కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో కొంత జాప్యం జరిగిందని.. ప్రస్తుతం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# దమ్ముంటే సీఎస్ఐ గ్రౌండ్‌కు రా.. తేల్చుకుందాం

## ఎమ్మెల్యే కేవీఆర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ కౌంటర్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు కౌంటర్ ఇచ్చారు. దమ్ముంటే సీఎస్ఐ గ్రౌండ్‌కు రావాలని అక్కడే తేల్చుకుందామని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. మున్సిపాలిటీ బీజేపీకి దక్కలేదన్న ఫ్రస్టేషన్‌లో ఎమ్మెల్యే హోదా మరిచి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడు షబ్బీర్ అలీ చట్టబద్ధంగా డబ్బులు ఇచ్చి భూములు కొనుగోలు చేశారని, బెదిరించి కబ్జాలు చేయలేదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే విద్యాసంస్థ పక్కన రిటైర్డ్ ఉద్యోగుల స్థలాన్ని కబ్జా చేసి ప్రహరీ కట్టారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి రూ.30 వేలు గజం ఉన్న ధరను రూ.3 వేలకు తగ్గించింది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ కళాశాలకు చెందిన 260 ఎకరాల భూమిని అరోరా కళాశాలకు ధారాదత్తం చేశారని, ఆ భూమిని తాకట్టు పెట్టి రూ.7 కోట్లు తీసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కేవీఆర్ మూడు నెలల క్రితం జపాన్ పర్యటనకు వెళ్లారని.. ఆ రహస్యాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. కాంగ్రెస్ నేతలు పండ్ల రాజు, కైలాస్ శ్రీనివాస్ రావు, చంద్రకాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. స్థానిక సంస్థల్లో 50 రిజర్వేషన్ల అమలుతో అతివలకు అవకాశాలు పెరిగాయి. మున్సిపల్ కౌన్సిలర్లుగా, చైర్‌పర్సన్‌గా పలువురు మహిళలు ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాలో జనరల్ స్థానాల్లో సైతం మహిళలు మున్సిపల్ పీఠాలను దక్కించుకోవడం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. ఎల్లారెడ్డి మినహా మిగతా అన్ని చోట్ల మహిళలు చైర్ పర్సన్ పదవులు దక్కించుకున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి

# పురం.. మహిళల పరం



- మేయర్, ఆరు చైర్‌పర్సన్ పదవులు వారికే..
- జనరల్ స్థానాల్లోనూ అవకాశం
- ఉమ్మడి జిల్లాలో సత్తా చాటిన అతివలు

ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పాలకవర్గాల ప్రమాణస్వీకారం సైతం పూర్తయ్యాయి. దాంతో అధికారులు, రాజకీయ పార్టీలు ఊపిరి పీల్చుకున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధికంగా మహిళా ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగా పదవులు కూడా మహిళలకే ఎక్కువగా దక్కాయి. ఆయా రాజకీయ పార్టీలు సైతం మహిళలకు పెద్దపీట వేశాయి. నిజామాబాద్ నగర కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలను హస్తం పార్టీ కైవసం చేసుకుని ఉమ్మడి జిల్లాలో క్లీన్ స్వీప్ చేసింది. వీటిల్లో ఎల్లారెడ్డిలో మినహా మిగతా అన్ని చోట్ల మహిళలు పదవి దక్కించుకున్నారు.

### మహిళలకే అత్యధిక స్థానాలు

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో మహిళలు అత్యధికంగా కౌన్సిలర్లుగా గెలుపొందారు. మొత్తం 60 డివిజన్లు, 178 వార్డులలో ఎన్నికలు జరగ్గా 119 మంది మహిళలు గెలుపొందారు. దాంతో మహిళా సాధికారత స్పష్టంగా కనిపించింది. నిజామాబాద్ మేయర్ పదవి, భీమ్‌గల్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ చైర్ పర్సన్ పదవులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. బోధన్, బిచ్కుంద, ఎల్లారెడ్డి జనరల్‌కు కేటాయించారు. అయితే బోధన్, బిచ్కుందలో కూడా మహిళలకే కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టింది. ఎల్లారెడ్డిలో మాత్రం పద్మ శ్రీకాంత్ చైర్మన్ అయ్యారు.

### ఒక చైర్మన్, రెండు వైస్ చైర్మన్లు మినహా..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒకే ఒక చైర్మన్, రెండు వైస్ చైర్మన్లు మినహాయించి అన్ని స్థానాల్లో మహిళలకే అవకాశం దక్కింది. ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్, బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీలలో వైస్ చైర్మన్ పదవులు మాత్రం పురుషులకు దక్కాయి.

### చైర్‌పర్సన్లు వీరే..

నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్, భీమ్‌గల్ చైర్‌పర్సన్‌గా నాగమణి, వైస్ చైర్‌పర్సన్‌గా సంటి లలిత, బోధన్‌లో తూము పద్మ, ఆర్మూర్‌లో గోనె లహరి, కామారెడ్డి ఇప్ప ఉమారాణి, కాసర్ల గోదావరి, ఎల్లారెడ్డి వైస్ చైర్‌పర్సన్‌గా మత్తమాల భాగ్యవతి ఎన్నికయ్యారు. బాన్సువాడలో కాసుల విజయ, రేష్మ బేగం, బిచ్కుందలో సీమా రమేష్, భాగ్యలక్ష్మి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులు దక్కించుకున్నారు.

# అవినీతిపరులెవరో తేల్చుకుందాం రా..!

## షబ్బీర్ అలీకి కేవీఆర్ సవాల్

**అక్షరటుడే, కామారెడ్డి :** అవినీతిపరులెవరో.. నిజాయితీపరులెవరో తేల్చుకుందామని చర్చకు రావాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి సవాల్ విసిరారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. షబ్బీర్ అలీ వయస్సుకు గౌరవమిచ్చి ఇన్నాళ్లు ఏమి అనకుండా ఊరుకున్నానని, అనవసరంగా తన జోలికి వస్తే చరిత్ర మొత్తం బయట పెడతానని హెచ్చరించారు. దొంగ కలప, దొంగ సారాయి అమ్ముకున్న చరిత్ర షబ్బీర్ అలీది అని విమర్శించారు. 1989 కంటే ముందు ఆయన ఆస్తులు 1994 వచ్చే సరికి ఎలా పెరిగాయని ప్రశ్నించారు. 1989లో ఊరూరా తిరిగి, ప్రజలకు సేవచేసి గెలవలేదన్నారు. ఆయనకు తొమ్మిది సార్లు అవకాశం ఇస్తే 1989, 2004లో మాత్రమే గెలిచారని ఎద్దేవా చేశారు. 2009లో ఎల్లారెడ్డి వెళ్లి షబ్బీర్ ఓటమి పాలయ్యారని.. మొన్న నిజామాబాద్ వెళ్లి కూడా ఓడిపోయారని కేవీఆర్ గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి ఎలక్షన్ అంటే ఖర్చులని, ఆయనకు మాత్రం ఎలక్షన్ అంటే కలెక్షన్ అని ఎద్దేవా చేశారు. ఐదంతస్తుల భవనం అనుమతి లేకుండా కట్టారని, ఫైర్ ఇంజన్ కూడా ఇంటి చుట్టూ తిరిగే పరిస్థితి లేదన్నారు. ఆయనకు హిందీ తప్ప తెలుగు సరిగ్గా రాదని, ఇంగ్లిష్ అయితే అసలే రాదన్నారు. కామారెడ్డికి పట్టిన శని ఆయన అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ టికెట్ విషయంలో డబ్బులు ఎవరిచ్చారో, ఎక్కడిచ్చారో షబ్బీర్ అలీ చెప్పాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలకు సంబంధించి ఒక్క గజం భూమి తాము అమ్ముకున్నామని తేలినా గుండు గీయించుకుని మీసం లేకుండా తిరుగుతానని కేవీఆర్ అన్నారు. అరోరా కాలేజీ దోస్తు ఎవరో.. ధర్నా చేయించింది ఎవరో అందరికీ తెలుసన్నారు. షబ్బీర్ అలీ చేసిన ఆరోపణలపై మసీదు ఎక్కాలన్నారు. కేఆర్ రాజిరెడ్డి భూములు కబ్జాలు చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని విమర్శించారు. ఆ భూములు ఎలా దక్కుతాయో చూస్తానని సవాల్ చేశారు.





# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా జిల్లాలో అండర్ సెక్షన్-163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని 58 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయన్నారు. ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు ఉన్నాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు విధించామని తెలియజేశారు. సెంటర్ల వద్ద ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడవద్దని సూచించారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దన్నారు. పరీక్షా కేంద్రం నుంచి 200 మీటర్ల వరకు పరిసర ప్రాంతాల్లోని అన్ని జిరాక్స్ సెంటర్లను ఈనెల 25 నుంచి మార్చి 18 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో బన్సల్ విద్యార్థుల ప్రతిభ



**అక్షరటుడే, ఇందూరు :** జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నిజామాబాద్ బన్సల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కళాశాల డైరెక్టర్ మేకల లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు ప్రతిభ దాటిన విద్యార్థులను కళాశాలలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థి రవితేజ 96.66 శాతం, ఆకుల శ్రీహర్ష 99.47 పర్సంటేజీ, నరసింహ 91.66 శాతం, త్రిష 89.21శాతం సాధించారని పేర్కొన్నారు. కళాశాల స్థాపించిన రెండో సంవత్సరంలోనే అద్భుతమైన విజయాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. కళాశాల అధ్యాపకుల అనుభవం కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. ఇకపై ఇతర నగరాలకు పట్టణాలకు పంపే అవసరం లేకుండా నిజామాబాద్‌లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త నరాల సుధాకర్, కళాశాల కో డైరెక్టర్ జమున, అధ్యాపకులు అభిషేక్ తివారి, సురేంద్ర గోయల్, మనీష్ తివారి తదితరులు పాల్గొన్నారు.


# బాన్సువాడలో ఘరానా చోరీ..

## కారు అద్దాలు పగులగొట్టి రూ.8లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడలో ఘరానా చోరీ జరిగింది. దుండగులు కారు అద్దాలను ధ్వంసం చేసి రూ. 8 లక్షలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బిచ్కుంద మండలం హస్గుల్ గ్రామానికి చెందిన మాధవరావు తన బంధువు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయి. ఈ క్రమంలో మాధవరావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బాన్సువాడ శాఖలో తన ఖాతా నుంచి మంగళవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో రూ.8 లక్షలు డ్రా చేశాడు. అనంతరం పట్టణంలోని తాడ్కోల్ రోడ్డులో ఉన్న రిలయన్స్ స్మార్ట్ వద్ద కారును పార్క్ చేసి సరుకులు కొనడానికి వెళ్లాడు. ఈ సమయంలో గుర్తుతెలియని దుండగులు కారు అద్దాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి వెంటనే స్పందించి పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. రద్దీగా ఉండే తాడ్కోల్ ప్రధాన రోడ్డుపై పట్టపగలు రూ.లక్షల్లో చోరీ జరగడంతో పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

# జాతీయ రహదారిపై కారు బీభత్సం: ఒకరికి గాయాలు



**అక్షరటుడే, కామారెడ్డి :** ప్రమాదవశాత్తు అదుపుతప్పిన ఓ కారు డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు నుంచి వెళ్తున్న కంటైనర్ ఢీకొంది. దీంతో కారు మంటల్లో దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం సదాశివనగర్ మండలం పద్మాజీవాడి బైపాస్ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు కియా సెల్టోస్ కారులో రాహుల్ అనే వ్యక్తి వెళ్తున్నాడు. పద్మాజీవాడి బైపాస్ బ్రిడ్జిపైకి కారు చేరుకోగానే కారు అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టింది. కొద్దిదూరం అలాగే డివైడర్‌కు ఆనుకుని వెళ్లి అవతలి వైపునకు హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొంది. ఈ క్రమంలో కారులో నుంచి మెరుపులు రావడంతో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో కారులో వెళ్తున్న రాహుల్‌కు స్వల్ప గాయాలు కాగా సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను ఆర్పివేశారు. గాయాలైన రాహుల్‌ను అంబులెన్స్ ద్వారా జీజీహెచ్ తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిపిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.





**మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో ఎక్కడా వ్యక్తిగత ఆరోపణలు లేకుండా సాగిన నాయకుల ప్రచారం.. ఎన్నికలయ్యాక మొదలైంది. ఈ పరిణామం కామారెడ్డి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీంతో కామారెడ్డిలో రాజకీయాలు హాట్‌హాట్‌గా మారాయి. షబ్బీర్‌అలీ, కేవీఆర్ మధ్య మాటలయుద్ధం తారాస్థాయికి చేరింది.** – అక్షరటుడే, కామారెడ్డి

# కేవీఆర్ Vs షబ్బీర్



- కామారెడ్డిలో హీటెక్కిన రాజకీయాలు
- ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు
- ఎన్నికలయ్యాక చెలరేగిన మాటల యుద్ధం
- విస్తుపోతున్న కామారెడ్డి ప్రజలు

కామారెడ్డి నియోజకవర్గంలో గత రెండేళ్లుగా రాజకీయాలు సైలెంట్ మోడ్‌లో సాగాయి. అభివృద్ధి విషయాల్లో ఎవరికి వారు పనిచేసుకుంటూ వెళ్లిపోయారు. కాగా.. ప్రస్తుతం కామారెడ్డి రాజకీయాలు మరోసారి హాట్‌హాట్‌గా మారాయి. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఒకరిపై ఒకరు చేసుకుంటున్న అవినీతి ఆరోపణలతో కామారెడ్డిలో రాజకీయం వేడెక్కింది. ఎన్నికలు పూర్తయ్యాక మొదలైన ఈ మాటల యుద్ధం ఎటువైపు దారి తీస్తుందోననే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

### అవినీతి ఆరోపణలు

కామారెడ్డి నియోజకవర్గంలో రెండేళ్ల తర్వాత రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పటిదాకా అక్కడక్కడా మాత్రమే సాగిన ఆరోపణలు, ప్రత్యారోపణలు ఇప్పుడు మీడియా ముఖంగా చోటుచేసుకుంటున్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కాటిపల్లి వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ కొనసాగుతున్నారు. ఇద్దరు నాయకులు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తూనే ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. ఆరోపణలకు మున్సిపల్ ఎన్నికలు కేంద్ర బిందువుగా మారాయి. మున్సిపాలిటీలో అవినీతి పెచ్చు మీరుతుందని, రెండేళ్లుగా అడ్డుకట్ట వేశానని, బీజేపీ ఛైర్మన్ అయితే అవినీతి జరగకుండా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు. షబ్బీర్ అలీ సైతం అవినీతికి ఆస్కారం ఉండకుండా పాలన అందిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అంశం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే వరకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

### ఎన్నికలు పుర్తయ్యాక..

మున్సిపల్ ఎన్నికల్లో అవినీతి అంశంపైనే ప్రచారం సాగిందనేది బహిరంగ రహస్యం. అయితే కామారెడ్డి ప్రజలు ఇరు పార్టీలకు ఎవరికీ స్పష్టమైన మెజారిటీ ఇవ్వకపోవడంతో హంగ్ ఏర్పడింది. దీంతో రాజకీయం రసవత్తరంగా సాగింది. అనూహ్యంగా బీఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్ ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. షబ్బీర్ అలీ సైతం అవినీతికి పాల్పడితే చర్యలుంటాయని కౌన్సిలర్లకు స్పష్టం చేస్తూనే డిగ్రీ కళాశాల భూములు, ఎమ్మెల్సీ టికెట్ అమ్ముకునే విషయంపై ఎమ్మెల్యేపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు పూర్తయ్యాక ఈ ఆరోపణలు చేయడంతో రాజకీయ వేడి రాజుకుంది.

### ఆశ్చర్యపోతున్న ప్రజలు..

గడిచిన రెండుమూడు నెలల్లో సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో అధికార పార్టీ మద్దతుతో సర్పంచులు గెలవగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. త్వరలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రానున్నాయి. ఎన్నికలు పూర్తయి ఎక్కడికక్కడ స్తబ్దుగా ఉండాల్సిన సమయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు ఒకరిపై అవినీతి ఆరోపణలు చేసుకోవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### కేవీఆర్ కౌంటర్..

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేసిన అవినీతి ఆరోపణలపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి తీవ్రస్థాయిలో షబ్బీర్ అలీకి కౌంటర్ ఇచ్చారు. షబ్బీర్‌అలీ రాజకీయ జీవితమే అవినీతితో కూడుకున్నదని ధ్వజమెత్తారు. భూముల కబ్జా, ఛైర్మన్ల పదవుల కోసం తీసుకున్న డబ్బులు, దొంగకలప, దొంగ సారాయి అమ్ముకున్నారని ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు సైతం కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే కేవీఆర్‌పై విరుచుకు పడ్డారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ వివరాలు వెల్లడించారు. బాధితులు గంగారెడ్డి, నిఖిల్ రెడ్డి, జగదీష్‌లు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు ఇవ్వగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని రికవరీ చేశామన్నారు. ఈ మేరకు మంగళవారం వాటిని బాధితులకు అందజేశామన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి మగ్గిడి క్రీడాకారులు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం మగ్గిడి పాఠశాల పూర్వవిద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మధు తెలిపారు. ఈనెల 17 నుంచి 19 వరకు కరీంనగర్ జిల్లా వేములవాడలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ వాలీబాల్ పోటీలో విద్యార్థులు అమూల్య, నవీన, కీర్తి, సంజన, సంజూష, స్పందన, సాయిరాంలు పాల్గొంటారని పీడీ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను మగ్గిడి గ్రామ వీడీసీ సభ్యులు, పాఠశాల హెచ్ఎం తిరునగరి హరిత, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్ క్రీడాకారులను అభినందించారు.

## ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లకు సన్మానం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ నూతన ఛైర్‌పర్సన్ గోనె లహరి, వైస్‌ఛైర్మన్ కాటిపల్లి వెంకట్ రెడ్డిలను ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, సభ్యులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ.. ఆర్మూర్ పట్టణ ప్రజలు ఇచ్చిన తీర్పు చాలా గొప్పదన్నారు. పట్టణ ప్రజలు చైతన్యవంతులై ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధతతో సామాజిక సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులనే ఎన్నుకున్నారని ప్రశంసించారు. నూతన పాలకవర్గ సభ్యులందరూ ప్రజలకు మంచి సేవలు అందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో అర్గుల్ నర్సయ్య, పీసీ గంగారెడ్డి, కాటిపల్లి చిన్న గంగారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు రాంప్రసాద్, వినోద్, రాంచందర్, శేఖర్, ఇస్తాకుద్దీన్, భాస్కర్, దొండి గంగా మోహన్, రజనీష్, కిరాడ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నూతన పాలకవర్గం సభ్యులతో కలిసి ఛైర్మన్ పద్మ శ్రీకాంత్ మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ మంజూరు చేసిన సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. పట్టణానికి చెందిన వైశ్య సంఘం పద్మశాలి, అవుసుల ఇతర సంఘాలకు సంబంధించిన శ్మశాన వాటికలకు వెళ్లేందుకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. వాటితో పాటు పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు 2.0 అమృత్ పథకం కింద నీటి ట్యాంక్ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. పట్టణంలో అన్ని వీధుల్లో అమృత్ పథకం కింద పైప్ లైన్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. డ్రెయినేజీ, సిమెంట్ రోడ్డు పనులు నాణ్యతగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం కప్‌లో బాల్కొండ క్రీడాకారుల ప్రతిభ



**అక్షరటుడే, బాల్కొండ:** జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో బాల్కొండ నియోజకవర్గ క్రీడాకారులు ప్రతిభ చూపారని ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14న నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్‌లో భాగంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. బాల్కొండ పేరు నిలబెట్టినందున జట్టుకు వ్యక్తిగతంగా రూ.10వేలు అందజేస్తున్నానని ఆయన అన్నారు. ఈనెల 19వ తేదీ నుంచి 23 వరకు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో క్రీడాకారులు ప్రతిభ చూపాలని ఆయన కోరారు. వీరిని అభినందించిన వారిలో ఎంఈవో బట్టు రాజేశ్వర్, మండల ప్రజా పరిషత్ సూపరింటెండెంట్ రమణ, బాల్కొండ మండల క్రీడల అభివృద్ధికారి రాజ్ కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి భవానీ, ఇన్‌ఛార్జి హెచ్ఎం ప్రశాంత్ కుమార్, మైనారిటీ స్కూల్ ప్రిన్సిపల్ చందన తదితరులు అభినందించారు.

## కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా స్కూల్‌కు రూ.లక్ష విరాళం



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలకు మంగళవారం కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అశోక్ రెడ్డి కుమారుడు కిషోర్ రెడ్డి (ఎన్ఆర్ఐ) రూ.లక్ష పాఠశాలకు విరాళం అందజేశారు. జనవరి 26న పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శేషయ్య పాఠశాలలో విద్యార్థులకు కూర్చునేందుకు బెంచీలు లేవని తెలపడంతో అశోక్ రెడ్డి ఈ విషయాన్ని తన కుమారుడికి తెలిపారు. ఆయన వెంటనే పాఠశాలకు రూ.లక్ష విరాళం ప్రకటించారు. అనంతరం అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. తన కుమారు ఇచ్చిన సొమ్ముతో పాఠశాలలో బెంచీలో ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యాభివృద్ధికి తమ కుటుంబం తోడ్పాటునందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రాజనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధారి మండల కేంద్రంలో..



పెద్దకొడప్‌గల్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో..



ఆర్మూర్‌లో..

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఉమ్మడిజిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. పరీక్ష ప్యాడ్లు, పుస్తకాలు అందజేశారు. ఆయన చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంలో కేసీఆర్ చేసిన కృషిని కొనియాడారు.** – అక్షరటుడే, నెట్‌వర్క్



నాగిరెడ్డిపేటలో..



ముప్కాల్‌లో..



ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..



లింగంపేట మండల కేంద్రంలో..

## ఇంటర్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



**అక్షరటుడే ఎల్లారెడ్డి:** ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు అవసరమయ్యే పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, స్కేల్‌లను అందజేశారు. కన్నారెడ్డి గ్రామానికి చెందిన పేరుపల్లి సాయిబాబా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 200 మందికి, కస్తూర్బా బాలికల పాఠశాలలో 150 మంది విద్యార్థులకు పరీక్షకిట్లను అందజేశారు. కేసీఆర్ బర్త్‌డే పురస్కరించుకొని విద్యార్థులకు తనవంతు సాయం చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేసిన సాయిబాబాను అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎల్లారెడ్డి నూతన పాలకవర్గానికి సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులను కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశ్రీకాంత్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో కలిసికట్టుగా పనిచేస్తూ ముందుకు వెళ్దామన్నారు. కార్యక్రమంలో 12 వార్డుల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.